క్లుప్తంగా

లంకా సూర్యనారాయణకు పురస్కారం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య గ్రంథాలయంలో శనివారం వ్యవస్థాపకుడు లంకా సూర్యనారాయణకు బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'గ్రంథాలయ బ్రహ్మ' పురస్కార ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా గుంటూరు పశ్చిమ తహసీల్దార్ టి. శ్రీనివాసరెడ్డి పాల్గొని, సూర్యనారాయణకు పురస్కారాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండి అశోక్ రెడ్డి, సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ, కాశీపట్నం సుబ్బారావు, లైబ్రేరియన్ సుభాషిణి, పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వదిలి వెళ్లిన వృద్ధురాలికి ఆశ్రయం



గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చిన ఓ తల్లిని అందరూ వదిలి వెళ్లారు. ఒంటరిగా వార్డులో చికిత్స పొందుతున్న ఆమె గురించి గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్టుకు ఆసుపత్రి సిబ్బంది అందించారు. దీంతో శనివారం ట్రస్టు సభ్యులు ఆమెను పొన్నూరులోని గోతాలస్వామి ఆశ్రమానికి చేర్పించారు. ఎవరికైనా అనాథలు తారసపడితే తమ దృష్టికి తీసుకు రావాలని, వారికి ఆశ్రయం కల్పిస్తామని ట్రస్టు నిర్వాహకుడు పఠాన్ అల్లాబక్షు తెలిపారు. జీజీహెచ్‌కు వచ్చే రోగుల సహాయకులకు ప్రతిరోజూ డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్‌స్పెషాలిటీ భవనం ఎదుట ఉచితంగా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నామని తెలిపారు. గుంటూరు నగరంలో ఉచితంగా అంబులెన్సు ఏర్పాటు చేసి ఆసుపత్రుల నుంచి ఇళ్లకు, ఇళ్ల నుంచి ఆసుపత్రులకు రోగుల్ని ఉచితంగా తరలిస్తున్నామని చెప్పారు. ట్రస్టు సేవల్ని వినియోగించుకోవాలనుకునేవారు సెల్ నంబర్లు 81432224 56-9397602 553ను సంప్రదించాలని సూచించారు.

డాక్టర్ అమర్‌నాథ్‌కు అవార్డు



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, అమర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సూరత్ అమర్‌నాథ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.ధర్మారావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ జె.నరేష్‌బాబు ఆధ్వర్యంలో అవార్డును ఆయనకు పలువురు యూనియన్ నేతలు అందజేశారు. ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 52వ వార్షిక సదస్సు గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో అసోసియేషన్ నేతలు డాక్టర్ అమర్‌నాథ్‌కు అవార్డును అందజేశారు. గతంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన పలు నూతన ఆవిష్కరణలతో ఆర్థోపెడిక్ బ్రాంచ్ ఖ్యాతిని ఇనుమడింప చేశారని రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ జె.నరేష్‌బాబు కొనియాడారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్స్ డాక్టర్ జి.వరప్రసాద్, డాక్టర్ వి.వి.నారాయణరావు, డాక్టర్ రమణయశస్వీ, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, డాక్టర్ కంచర్ల రాంప్రసాద్ పాల్గొన్నారు.

పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతిగా డాక్టర్ భాస్కరరావు



గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ పీడియాట్రిక్ సర్జరీ (పిల్లల శస్త్రచికిత్స) విభాగాధిపతిగా డాక్టర్ చందా భాస్కరరావు విధుల్లో చేరారు. గతంలో గుంటూరు జీజీహెచ్‌లో పనిచేసిన ఆయన్ను సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాలకు బదిలీ చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనకు ఇటీవల ఇచ్చిన పదోన్నతుల్లో ప్రొఫెసర్ హోదా లభించింది. పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతిగా విధుల్లో చేరిన డాక్టర్ భాస్కరరావును శనివారం పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందించారు.

గైనకాలజీ ప్రొఫెసర్‌గా డాక్టర్ ఝాన్సీ వాణి

జీజీహెచ్ గైనకాలజీ ప్రొఫెసర్‌గా డాక్టర్ ఝాన్సీ వాణి శనివారం విధుల్లో చేరారు. విజయవాడలో పనిచేస్తున్న ఆమెను మ్యూచ్‌వల్ బదిలీలో భాగంగా అధికారులు గుంటూరుకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ ఇందిరను విజయవాడకు పంపారు. డాక్టర్ ఝాన్సీవాణి శనివారం గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతీదేవిని కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.

పాలనలో ట్రెండ్ సెట్టర్ జగన్

- ఎమ్మెల్యే సుచరిత
- విప్లవంలా నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన
- కులమతాలు, పార్టీలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుచరిత, పక్కన భవకుమార్, ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల కన్వీనర్ తదితరులు

ప్రత్తిపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, సుపరిపాలనలో ట్రెండ్ సెట్టర్ అని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కొనియాడారు. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం కల్యాణ మండపంలో శనివారం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మా నమ్మకం నువ్వే జగనన్న ఉద్దేశాలు, విధి విధానాల్ని వివరించారు. తొలుత దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే సుచరిత, నియోజకవర్గ పరిశీలకుడు బొప్ప భవకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ ప్రతి పథకం పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ కులమతాలు, పార్టీలకు అతీతంగా అందాలన్న ఉద్దేశంతోనే వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి నూతన వ్యవస్థల్ని ప్రజల ముంగిటకు తీసుకు వస్తున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విప్లవంలా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారని చెప్పారు. ప్రతి గ్రామంలో ఎనభై నుంచి తొంభై శాతం మంది ప్రజలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఇది గొప్ప బాధ్యతగా తీసుకుని వలంటీర్లు మరింత చురుకుగా ప్రజలకు సేవలు అందించాలని ఆమె సూచించారు. ఏ కుటుంబంలోనూ అర్హత ఉండీ సంక్షేమ పథకం అందలేదన్న మాటే రాకూడదని చెప్పారు. వైఎస్సార్ సీపీ అంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలదన్న రీతిన జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గృహ సారథులు పార్టీకి రథసారథులన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరం ప్రజల వద్దకు వెళ్లి పథకాలు, పాలనను వివరిద్దామని కోరారు. ప్రజలకు పోలింగ్ బూత్‌ల వరకు నడిపించే బాధ్యత తను సీఎం వలంటీర్లు, సారథులపై ఉంచారని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్ మాట్లాడుతూ పార్టీ ఒక కుటుంబలాంటిదని, చిన్న చిన్న సమస్యల్ని అధిగమించుకుంటూ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. సుచరిత లాంటి మంచి మనిషిని నియోజకవర్గం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించడంతో పాటు, సీఎం జగన్‌కు అందరి ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు విప్పాల కృష్ణారెడ్డి, గుల్జార్ బేగం, ఎంపీపీ దాసరి అన్నమ్మ, మండల పార్టీ కన్వీనర్ గట్టు విజయ్, సచివాలయ మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ బాపతు వెంకటరమణ, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఉడుతూరి ఓం ప్రకాష్ రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మురళి, వైస్ ఎంపీపీ అఫ్రీనా సుల్తానా, వాసిమళ్ల అమృతయ్య పాల్గొన్నారు.



హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు

రాష్ట్రానికి జగనన్న ముద్దు- చంద్రబాబు వద్దే వద్దు

రాప్తాడు నియోజకవర్గం నుంచి తాడేపల్లికి పాదయాత్ర

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగనన్న ముద్దు.. చంద్రబాబు వద్దే వద్దు అంటూ శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నుంచి తాడేపల్లికి అభిమానులు చేపట్టిన పాదయాత్ర శనివారం గుంటూరు నగరంలోకి ప్రవేశించింది. చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన జగనన్న సైనికులు, వైఎస్సార్ సీపీ నాయకులు వారి గ్రామం నుంచి పాదయాత్రగా లక్ష కరపత్రాల్ని పంపిణీ చేస్తూ తాడేపల్లికి వెళ్లనున్నారు. శనివారం గుంటూరు శివారుల్లోని నల్లపాడు సమీపంలో పాదయాత్రగా వెళుతూ మన రాష్ట్రానికి జగనన్న ముద్దు - చంద్రబాబు వద్దు అంటూ నినాదాలు చేస్తూ కరపత్రాల్ని పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు వారికి మద్దతు తెలిపి కొంతదూరం ప్రయాణించారు. సాయికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పాదయాత్రలో పలువురు పెద్దలు, యువకులు ఉన్నారు.

బడుగుల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

చేబ్రోలు: రాష్ట్రంలో బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ దాసరి నారాయణరావు, మల్లెల రాజు తెలిపారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పొన్నూరు నియోజకవర్గ అభివృద్ధిపై టీడీపీ అసత్య ఆరోపణల్ని ఖండించారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆధ్వర్యంలో గడిచిన మూడున్నర ఏళ్లలో ప్రభుత్వం సుమారు రూ. 1300 కోట్ల విలువైన సంక్షేమ పథకాల్ని నియోజకవర్గ ప్రజలకు అందజేసిందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రుద్రపాటి ఆదిశేషులు, గేరా సంజీవ్, మోపర్తి ప్రమీల, మంద్రు అనిత, పిల్లి మాణిక్యరావు, షేక్ మాము, అక్కి నాగరాజు, ఆకిశెట్టి గాంధీ, కొల్లేరు శ్రీనివాసరావు, జానీ బాష, ఆరేటి మధు, నయీమ్ బాష, గోపాలం అశోక్, మస్తాన్, దేవరపల్లి విజయ్, దేవరకొండ గోపి పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో ముగిసిన ఫార్మా ఎనలైటికా



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామారావు తదితరులు

గుంటూరు రూరల్: ఫార్మా రంగంలో రానున్న కాలంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. గత రెండు రోజులుగా నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో నిర్వహిస్తున్న ఫార్మా ఎనలైటికా 2కె23 జాతీయ స్థాయి సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రతో పాటు వివిధ రాష్ట్రాలనుంచి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఎనలైటికల్ రంగంలో పరిశోధన పత్రాల్ని ఈ- పోస్టర్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారని చెప్పారు. ఎనలైటికల్ పరికరాల పనితీరు, నిర్దిష్టతను పరీక్షించేందుకు క్రమాకరణ పద్ధతులు, ఔషధ పరమాణు నిర్మాణాలు, స్టడీ చేయాల్సిన పద్ధతుల్ని సదస్సులో చర్చించినట్లు పేర్కొన్నారు. అనంతరం పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కేవీఎస్ఆర్ సిద్ధార్థ కళాశాల విద్యార్థి మోహన నాగ రాజేశ్వరికి ప్రథమ, చలపతి కళాశాల విద్యార్థులు కె. మీనాక్షి శ్రీనివాస్, ఎం. శివానీకి ద్వితీయ, తృతీయ స్థానాలు లభించాయి. రాత పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

విజ్ఞాన్ నిరులలో ఆకట్టుకున్న ప్రాజెక్ట్ ఎక్స్‌పో



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న బీహెచ్‌ఈఎల్ సంస్థ డైరెక్టర్ శివ తదితరులు

గుంటూరు రూరల్: ప్రాజెక్ట్ ఎక్స్‌పోల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను మెరుగు పరచవచ్చని బీహెచ్‌ఈఎల్ సంస్థ డైరెక్టర్ శివ మకుటం తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరులలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ఎక్స్‌పో ప్రదర్శన్ 2023ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టుల రూపకల్పనకు కృషి చేయాలని తెలిపారు. ప్రిన్సిపాల్ పి. రాధిక తదితరులు విద్యార్థులు తయారు చేసిన ఇంజినీరింగ్ ప్రాజెక్టులతో పాటు వ్యవసాయ, స్త్రీ రక్షణ, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాల ప్రాజెక్టులను మెచ్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎక్స్‌పో నిర్వాహకురాలు జి. సంధ్య, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం: ఎంపీపీ

కాకుమాను: ప్రజా ప్రతినిధులందరం కలసికట్టుగా ఉండి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం మండల సర్వసభ్య సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని తెలిపారు.రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌కు సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో రైతుల సాగునీరుకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సొంత ఖర్చులతో అప్పాపురం చానల్‌లో గుర్రపు డెక్కను తొలగిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం చానల్‌లో నీరు పుసులూరు వరకు వచ్చిందని, శని, ఆదివారాల్లో కాకుమానులోని అన్ని గ్రామాలకు సరఫరా అవుతుందని చెప్పారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, ఎంపీడీఓ డి.శరత్ బాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

నెహ్రూనగర్: జగనన్న లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, రానున్న ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం కానున్నాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఏటుకూరు జగనన్న లే- అవుట్‌ను శనివారం నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతంపై పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేఅవుట్స్‌లో లబ్ధిదారులంతా ఇంటి నిర్మాణం చేసుకోవాలని, నగరపాలక సంస్థ నుంచి తోడ్పాటు ని అందిస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ తప్పనిసరిగా ప్రతి రోజూ నిర్దేశిత లక్ష్యానికి తగిన విధంగా పనులు చేయాలని, రోజువారి నివేదిక ఎప్పటికప్పుడు అందించాలని కమిషనర్ ఆదేశించారు.

శివాలయంలో ఇద్దరు ఉద్యోగులు విధుల నుంచి తొలగింపు

పెదకాకాని: స్థానిక శివాలయంలో ఇద్దరు ఉద్యోగులు క్రమశిక్షణ ఉల్లంఘించడం, గొడవ పడటంతో విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈనెల 18న మహా శివరాత్రి కల్యాణోత్సవాలు పురస్కరించుకొని సిబ్బంది రాత్రిపూట విధులు నిర్వహించారు. ఈ సమయంలో టి. వేణు, కె.దుర్గ అనే ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఓ మహిళ వ్యవహారంలో గొడవకు దిగారు. ఈ వ్యవహారం బహిర్గతం కావడంతో శనివారం ఏసీ ఇద్దరి నుంచి లిఖితపూర్వకంగా వివరాలు సేకరించారు. అనంతరం తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు.

సేంద్రియ పద్ధతులతో ఆరోగ్యకరమైన కూరలు

గుంటూరు రూరల్: సేంద్రియ పద్ధతిలో ఆరోగ్యకరమైన కూరగాయలు పండించి, మంచి లాభాలు సాధించవచ్చని రైతు మీసాల రామకృష్ణ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సేంద్రియ వ్యవసాయంపై రైతు శిక్షణ తరగతులు నిర్వహించారు. నాగర్‌కర్నూలుకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. వారికి సేంద్రియ వ్యవసాయ విధానం, కషాయాల తయారీ తదితర విషయాల్ని క్షేత్రస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి రైతు ఏడుకొండలు, రైతు నేస్తం ఫౌండేషన్ సీఈవో సాంబశివరావు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువతి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్‌లో నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన 19 సంవత్సరాల యువతి ఈనెల 24న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబసభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బస్టాండ్‌లో అధిక ధరలపై ఫిర్యాదు

పాత గుంటూరు: గుంటూరు బస్టాండ్‌లోని స్టాల్స్‌లో ఎక్కువ రేట్లను వసూలు చేస్తున్నారని మంగళగిరికి చెందిన శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. గుంటూరు- 2 డిపోలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డిపో మేనేజరు కార్యక్రమంలో డిపో మేనేజరు షేక్ అబ్దుల్ సలామ్ ప్రజల నుంచి ఫోన్ ద్వారా ఫిర్యాదులు, సమస్యలు తెలుసుకున్నారు. నల్లపాడులోని స్కూల్స్ వద్ద ఆర్టీసీ బస్సులు అతి వేగంగా వెళుతున్నాయని, నిదానంగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని నల్లపాడుకు చెందిన సునీతారెడ్డి కోరారు. దివ్యాంగుడినైన తన సహాయకుడికి బస్‌పాస్ ఇవ్వాలని కర్లపాలేనికి చెందిన రామలింగేశ్వరరావు కోరారు. పేరేచర్ల నుంచి తెనాలి రూట్‌లో బస్సుల్ని పునరుద్ధరించాలని పలకలూరుకు చెందిన చామర్తి వేంకటేశ్వరరావు విన్నవించారు.

నేడు షేర్ మార్కెట్‌పై అవగాహన సదస్సు

మదనపల్లె : నాగ సతీష్ వెల్త్ బిల్డర్స్ ఆధ్వర్యంలో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల అంశంపై ఆదివారం ఉదయం అరండల్‌పేట శివ థియేటర్ పక్కన హోటల్ కార్తికేయ గ్రాండ్‌లో ఉదయం 10, మధ్యాహ్నం 1, సాయంత్రం 4, రాత్రి 7 గంటలకు ఉచిత అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఫైనాన్షియల్ అడ్వైజర్ కృష్ణ కైలాస్ తెలిపారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు, భవిష్యత్తు అవసరాలకు ఇన్వెస్ట్, లాభాలపై ఆర్థిక నిపుణులు వివరిస్తారని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9966610358ను సంప్రదించాలని సూచించారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం

గుంటూరు ఈస్ట్: విద్యుత్ వినియోగదారులు ఆదివారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ అన్ని మండల కేంద్రాల్లో, విద్యుత్ శాఖ రెవెన్యూ కార్యాలయాల్లో బిల్ కౌంటర్లు ఆదివారం పని చేస్తాయని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా జగనన్న జనరంజక పాలన సాగుతోందని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండలంలోని 26వ డివిజన్ అంకిరెడ్డిపాలెంలో శనివారం కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అరాచకాలు – ఈ ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలు బేరీజు వేసుకోవాలని చెప్పారు. గ్రామంలో ప్రతి గడపకూ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సమస్యల్ని తెలుసుకుని, సంబంధిత అధికారుల్ని పిలిచి అక్కడిక్కడే పరిష్కారాలు చూపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ దేశ రాజకీయాల్ని ప్రభావితం చేసేలా జగనన్న పాలన సాగుతోందని తెలిపారు. ప్రతి కుటుంబానికీ నాలుగైదు సంక్షేమ పథకాలు అందాయని పేర్కొన్నారు. ఇప్పటికే లక్షలాది రూపాయల్ని లబ్ధి చేకూరిన వైనం చూస్తే దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయలేని సంక్షేమ ఫలాల్ని ప్రజలకు మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి అందజేశారని వివరించారు. ఇది దేశ చరిత్రలోనే మైలురాయని, చరిత్రను తిరగరాసిన ఘనత మన జగనన్నకే దక్కిందని తెలిపారు. సంక్షేమ పథకాల పంపిణీలో వలంటీర్లు, గ్రామ సచివాలయం సిబ్బంది సేవల్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, ఆర్ అండ్ డీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, తురకపాలెం సొసైటీ చైర్మన్ తంగెళ్ల నాగేశ్వరరావు, మెట్టు వెంకటప్పారెడ్డి, లింగారెడ్డి, వెంకట్, పాపిరెడ్డి, వంగా నవీన్‌రెడ్డి, పుట్టా బాజీ, గోపి, కందుకూరి జ్యోతి, దుంపాల రాధ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతలోనూ నేత్ర సమస్యలు



కళాశాలలో నిర్వహిస్తున్న నేత్ర పరీక్షలు

వింజనంపాడు (ప్రత్తిపాడు): అత్యధిక సమయం స్మార్ట్ మొబైల్స్, ల్యాప్ టాప్‌లకు వెచ్చిస్తుండటం వల్ల యువతలోనూ నేత్ర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కిట్స్ కళాశాల కార్యదర్శి కోయ శేఖర్ తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్, చెరుకుపల్లి కామాక్షి ఐ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల సెక్రటరీ శేఖర్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాల్లో అధిక సమయం గడపటం వల్ల కళ్లు ఎక్కువగా అలసిపోతున్నాయని తెలిపారు. కంటి వైద్య నిపుణుడు వాసుదేవరావు మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్నవారు చిన్న సమస్యే కదా అని తేలికగా తీసుకోవద్దని, కంటి విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం శిబిరంలో వైద్యులు 180 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాబు, డైరెక్టర్ కె. హరిబాబు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ఎన్ఎస్ఎస్ వింగ్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతర సేవ



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వివేక్ ఆనంద్

ప్రత్తిపాడు: రోటరీ క్లబ్ ద్వారా ప్రజోపయోగ కార్యక్రమాల్ని నిరంతరాయంగా చేపట్టనున్నట్లు పెదనందిపాడు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కె. విక్టర్ జాన్‌పాల్ తెలిపారు. ప్రత్తిపాడులోని ఎస్ఆర్ఎస్ రెయిన్‌బో పాఠశాల ఆవరణలో శనివారం పెదనందిపాడు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన శిబిరానికి విశేష స్పందన లభించింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి 230 మందికి పైగా రోగులు హాజరయ్యారు. శంకర నేత్రాలయం వైద్యులు డాక్టర్ వివేక్ ఆనంద్, డాక్టర్ నీరజ పరీక్షలు నిర్వహించారు. చిన్నచిన్న సమస్యలున్న వారికి ఉచితంగా మందుల్ని అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన 130 మందిని ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ కార్యక్రమంలో విక్టర్ జాన్‌పాల్ మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ఎల్లప్పుడూ రోటరీ క్లబ్ తన సేవల్ని అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వై.కె.రామిరెడ్డి, స్కూలు డైరెక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ పోపూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవీంద్రబాబు

కాకుమాను:అపరిచిత వ్యక్తులతో బాలికలు అప్రమత్తంగా ఉండాలని కాకుమాను ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు, చిన్నారులు ఎక్కువగా లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు తెలిపారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తించినా, మాట్లాడినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు గానీ, 100 నంబర్‌కు గానీ ఫోన్ చేయాలని ఆయన విద్యార్థినులకు సూచించారు.ఈ సందర్భంగా గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.జోష్ మేరి, స్టేషన్ రైటర్ కిరణ్, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నత స్థానం

పెదకాకాని: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలని సీఐ బండారు సురేష్‌బాబు సూచించారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుట్టా దుర్గ అధ్యక్షత వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులంతా బాలికలతో గౌరవ మర్యాదలతో, సోదరభావంతో నడుచుకోవాలని సూచించారు. వారిని అల్లరి చేసినా, ఇబ్బందులకు గురి చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనివల్ల చదువుకు ఆటంకం కలగడంతో పాటు భవిష్యత్‌తో ఇబ్బందులు పడతారని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు సెల్‌ఫోన్ల వాడకం, ప్రవర్తన వంటి అంశాలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ తప్పక అవసరమని సూచించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ గీతాంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా ఆర్థోపెడిక్ సర్జన్స్ సీఎంఈ

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో ఆర్థోపెడిక్ సర్జన్స్ రాష్ట్ర సదస్సులో భాగంగా శనివారం నిర్వహించిన నిరంతర వైద్య విద్య కార్యక్రమం (సీఎంఈ) ఆసక్తికరంగా సాగింది. ప్రొఫెసర్ యాగ్రీశ్వరుడు ఓరేషన్‌ను కోయంబత్తూరు గంగా హాస్పిటల్‌కు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎస్.రాజాసభాపతి నిర్వహించారు. చేతికయ్యే గాయాల గుర్తింపు, చికిత్స గురించి వివరించారు. హ్యాండ్ సర్జరీ స్పెషాలిటీ చేయకపోయినప్పటికీ ఆర్థోపెడిక్ సర్జన్ ఇంజూరీస్‌కు ఆపరేషన్లు చేసే విధానాన్ని వివరించిన తీరు అమితంగా ఆకట్టుకుంది. ప్రొఫెసర్ నరసింహారెడ్డి మెమోరియల్ ఓరేషన్‌ను ఢిల్లీ ఎయిమ్స్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రాజేష్‌మల్హోత్రా నిర్వహించారు. జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీల్లో కాంప్లికేషన్స్ గుర్తింపు, చికిత్స విధానాల్ని వివరించారు. వీరితో పాటు పలువురు సీనియర్ సర్జన్లు సుమారు 40 అంశాలపై సీఎంఈలో మాట్లాడారు. రాష్ట్ర వార్షిక సదస్సు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో భాగంగా వంద పేపర్ ప్రజెంటేషన్లు, 90 పోస్టర్ ప్రజంటేషన్లు వచ్చినట్లు సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సూరత్ అమర్‌నాథ్ తెలిపారు.